సాక్షి
అనంతపురం
బుధవారం। 19 । ఏప్రిల్ । 2023



శాంతిభద్రతల్లో మీరే కీలకం
సచివాలయ మహిళా పోలీసు వ్యవస్థ ఏర్పాటయ్యాక శాంతిభద్రతల పరిరక్షణలో గణనీయమైన ఫలితాలు వచ్చాయని డీఐజీ అమ్మిరెడ్డి పేర్కొన్నారు. 8లో



విత్తనాలు సిద్ధం చేసుకోండి
ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ అధికారులను ఆదేశించారు. 8లో

గరిష్టం/కనిష్టం
43.8°/19.2°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుదలతో నమోదయ్యాయి. ఎండలు మండిపోతున్నాయి.



న్యూస్‌రీల్

5 రోజుల్లో చిరు జల్లులు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు '2 మిల్లీ మీటర్ల మేర) కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పగలు 39.0-40.8, రాత్రి 21.8-24.2 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని తెలిపారు. గాలిలో తేమ శాతం ఉదయం 40-65, మధ్యాహ్నం 19-38గా నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

చీనీ టన్ను రూ.34 వేలు



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 439 టన్నుల చీనీకాయలు అమ్మకానికి రాగా.. వాటిని ఈ-నామ్ పద్ధతిలో వేలం వేశారు. అలాగే టన్ను కనిష్ట ధర రూ.14 వేలు, సరాసరి రూ.23 వేలు చొప్పున క్రయ విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

ఏడీసీసీబీ డిపాజిట్లు రూ.650 కోట్లకు చేరుకోవాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం సెంట్రల్: ఏడీసీసీ బ్యాంకులో డిపాజిట్ల మొత్తం 2024 మార్చి నాటికి రూ.650 కోట్లకు చేరుకోవాలని చైర్‌పర్సన్ లిఖిత పిలుపునిచ్చారు. మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు డిపాజిట్ల రూపంలో రూ.522 కోట్లు ఉన్నాయని తెలిపారు. వచ్చే మార్చికి నిర్దేశించిన మేరకు లక్ష్యం చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం బ్యాంకు లావాదేవీలు రూ.1721 కోట్లని వివరించారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు శంకరరెడ్డి, రామాంజనేయులు, హైదర్‌వలి, కారుణ్య, జనార్దనరెడ్డి, ఈశ్వరరెడ్డి, బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖరాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పెత్తందారీ పోకడ

టీడీపీ బడుగుల బలహీనవర్గాల నాయకులకు గడ్డు కాలం వచ్చింది. వీరిపై అగ్రవర్ణాల వారి పెత్తనం ఎక్కువైంది. అడుగడుగునా వివక్ష, అవమానాలతో ఇబ్బంది పెడుతున్నారు. దీంతో పార్టీ కేడర్ రెండు వర్గాలుగా విడిపోతోంది. పెత్తనం తారస్థాయికి చేరుతుండటంతో బడుగులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పార్టీ అధినాయకత్వం జోక్యం చేసుకోకపోవడం గమనార్హం.



- బడుగులకు అడుగడుగునా అవమానం
- శింగనమలలో బండారు శ్రావణిపై అగ్రకులాల పెత్తనం
- ఏకంగా శ్రావణి తండ్రిపైనే దాడి
- కళ్యాణదుర్గంలో దళితులపై దాడి జరిగినా లోకేష్ మాట్లాడలేదు
- మడకశిరలో ఈరన్న వర్గాన్ని కాదని గుండుమలకు పగ్గాలు
- మొన్నటికి మొన్న పార్టీలో బీసీలకు చోటు లేదని బొమ్మగౌని రాజీనామా
- కదిరి టీడీపీలో స్వపక్షంలో విపక్షంలా కందికుంటతో అత్తార్ రోజా యుద్ధమే

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

తెలుగుదేశం పార్టీలో బడుగు, బలహీన వర్గాల నాయకులపై అణిచివేత పెరిగిపోతోంది. 2019 ఎన్నికలకు ముందే ఆ పార్టీలో ఇమడలేక చాలామంది నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు టీడీపీలో ఎస్సీల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ చంద్రబాబు కోటరీగా చెప్పుకునే అగ్రకులాల వారే పెత్తనం చేస్తుండటంతో ఉన్న కొద్ది మంది ఎస్సీ, ఎస్టీలు, బీసీలూ ఇతర పార్టీల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. తాజాగా పదిహేను రోజులపాటు నారాలోకేష్ పాదయాత్ర చేసినా.. తన కళ్లముందే ఎస్సీలపై దాడులు జరుగుతున్నా.. నోరు మెదపలేదు.

పేరుకే బండారు శ్రావణి..

శింగనమల నియోజకవర్గంలో బండారు శ్రావణి ఎప్పట్నుంచో టీడీపీకి సేవలందిస్తోంది. కానీ ఈమెకు అడుగడుగునా పార్టీలో అవమానాలే ఎదురవుతున్నాయి. లోకేష్ పాదయాత్ర సమయంలోనే శ్రావణి తండ్రిపై ఇతర సామాజికవర్గ పెద్దలు దాడి చేశారు. గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అయినా లోకేష్ దీనిపై స్పందించలేదు. అంతేకాదు నియోజకవర్గంలో పేరుకే శ్రావణి.. పెత్తనమంతా ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి చేతుల్లోనే ఉండటంతో ఎస్సీలు రగిలిపోతున్నారు.

మడకశిరలో ఈరన్నకు అవమానం

ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని నమ్ముకుని ఉన్న మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు రిక్త హస్తం ఎదురైంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన ఇక్కడ బీసీ సామాజిక వర్గానికి చెందిన గుండుమల తిప్పేస్వామిని సమన్వయకర్తగా నియమించడంపై ఎస్సీలు రగిలిపోతున్నారు. తిప్పేస్వామి పార్టీలు మారుతూ పదవులున్న చోటుకే వెళ్తుంటారని పేరు. ఇలాంటి వ్యక్తిని ఇక్కడ పెట్టి తమను ఏం చేయాలనుకుంటున్నారని ఈరన్న వర్గం కోపంతో ఉంది. ఇకపై తిప్పేస్వామి ఎవరికి చెబితే వారికి టికెట్ ఇచ్చే పరిస్థితి ఉందని, ఇదే జరిగితే ఈరన్న రెబల్‌గా మారే అవకాశం లేకపోలేదని సమాచారం.

దాడులు జరుగుతున్నా దిక్కేది?

ఇటీవల కళ్యాణదుర్గంలో ఎస్సీలపై దాడులు జరిగినపుడు.. సమీప నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర చేస్తున్నారు. టీడీపీ నేత ఉన్నం మారుతీచౌదరి వర్గం ఓ దళితుడిపై దాడి చేసింది. బండారుశ్రావణి తండ్రిపై దాడిచేసినా లోకేష్ మాట మాత్రంగానైనా పరామర్శించకపోవడంతో ఎస్సీ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి.

బీసీలనూ తొక్కేస్తున్నారు..

టీడీపీలో ఎస్సీ, ఎస్టీలనే కాదు బీసీలనూ తొక్కేస్తున్నారని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు.

మైనార్టీల పరిస్థితీ అంతే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనార్టీల పరిస్థితి కూడా తెలుగుదేశం పార్టీలో దారుణంగా ఉంది. 2014లో కదిరి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన అత్తార్ చాంద్‌బాషాను టీడీపీలోకి చేర్చుకుని అవసరానికి వాడుకుని ఇప్పుడు వదిలేశారు. అక్కడ కందికుంట ప్రసాద్ వైపే మొగ్గు చూపారు. కదిరిలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉంది. కానీ చాంద్‌బాషా స్వపక్షంలోనే విపక్షం లాగా కందికుంటతో రోజూ యుద్ధం చేయాల్సి వస్తోంది.

తాజాగా అనంతపురం జిల్లాలో ఈడిగ వర్గానికి చెందిన బొమ్మగౌని కిరణ్‌కుమార్‌గౌడ్ టీడీపీకి రాజీనామా చేశారు. ముప్పై ఏళ్లుగా టీడీపీ కోసం కృషి చేసినా కనీసం అనుబంధ సంఘాల్లో కూడా స్థానం ఇవ్వలేదని, ఈ పార్టీ బీసీలను అణగదొక్కుతోందని ఆరోపించి పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇంకా తనలాంటి ఎందరో బీసీ నేతలు పార్టీలో నలిగిపోతున్నారని, త్వరలోనే బయటకు వస్తారని చెప్పారు.

నిప్పుల కుంపటి

- గుంతకల్లులో 43.8 డిగ్రీలు, తాడిమర్రిలో 43.1 డిగ్రీలు
- ఉమ్మడి జిల్లాలో మండే ఎండలతో వేసవితాపం తీవ్రం



అనంతపురం అగ్రికల్చర్: వేసవి తాపం తారస్థాయికి చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. రెండు రోజులుగా వేకువజామున ఉష్ణోగ్రతలు పడిపోతుండటం విశేషం. మూడు గంటల పాటు చల్లటి వాతావరణం ఏర్పడుతుండటంతో కాస్తంత ఉపశమనం కలిగిస్తోంది. ఉదయం 9 గంటలకల్లా సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు ఉక్కపోత తగ్గడం లేదు. అర్ధరాత్రి వరకు వేడిగాలులు జనానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. మంగళవారం అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలో 43.8 డిగ్రీలు, శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలో 43.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. తాడిపత్రి 43.7, పామిడి, పెద్దవడుగూరు 42.7, శింగనమల 42.6, యల్లనూరు, కళ్యాణదుర్గం 42.5, కణేకల్లు 42.4, బొమ్మనహాళ్ 42.3, రాయదుర్గం 42.2 డిగ్రీలు నమోదయ్యాయి. అలాగే తనకల్లు 42.6, చెన్నేకొత్తపల్లి 42.4, పుట్టపర్తి 42.3 డిగ్రీలు నమోదయ్యాయి. నాలుగైదు మండలాలు మినహా మిగతా మండలాల్లో పగటి ఉష్ణోగ్రత 41 డిగ్రీలు దాటింది. అనూహ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదల నమోదు కావడం విశేషం. గత రెండు రోజులుగా 17 నుంచి 22 డిగ్రీల మధ్య రికార్డవుతోంది. అంతకు మునుపు రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. సూర్యప్రతాపం పెరగడంతో జనం ఇబ్బంది పడుతున్నారు.

టమాట కిలో రూ.5.50

అనంతపురం అగ్రికల్చర్: నగర శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5.50, కనిష్టంగా రూ.2.50, సరాసరి రూ.4 పలికింది. మార్కెట్‌కు 14 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

పేపర్లు దిద్దేటప్పుడు జాగ్రత్త



ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, ఏడీ, ఏసీఓలతో మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

- నేటి నుంచి టెన్త్ స్పాట్

రాప్తాడు రూరల్: 'పదో తరగతి జవాబు పత్రాలు దిద్దేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇది విద్యార్థుల జీవితంతో ముడిపడిన అంశం. ముఖ్యంగా మార్కుల లెక్కింపు సమయంలో ఒకటికి రెండుసార్లు పరిశీలించి వేయాలి' అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) బుధవారం ప్రారంభం కానుంది. అనంతపురం నగరంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇందుకోసం అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల నుంచి అన్ని సబ్జెక్టులకు సంబంధించి 2 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటిని కోడింగ్ చేసి స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. మూల్యాంకనం కోసం 8 మంది ఏసీఓలు, 1057 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 211 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

8.30 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలి

అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు బుధవారం ఉదయం 8.30 గంటలకు ఏసీఓల వద్ద రిపోర్ట్ చేసుకోవాలని డీఈఓ సూచించారు. విధులకు నియమించిన ప్రతి ఒక్కరూ రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలుంటే సంబంధిత వైద్యచికిత్స పత్రాలను తీసుకొస్తే పరిశీలించి విధుల నుంచి మినహాయిస్తామన్నారు. అనవసరంగా వ్యక్తిగత కారణమంటూ చెబితే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్డర్‌ను రద్దు చేయబోమని స్పష్టం చేశారు.

టీచర్లపై సస్పెన్షన్ ఎత్తివేత

రాప్తాడురూరల్: పదో తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పరీక్షల్లో తొలిరోజు ఇన్విజిలేషన్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎనిమిది మంది టీచర్లపై విధించిన సస్పెన్షన్‌ను డీఈఓ ఎం.సాయిరామ్ ఎత్తివేశారు. పెండింగ్ ఎంక్వయిరీ కింద పాత స్థానాల్లోనే వారిని కొనసాగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను డిప్యూటీ డీఈఓలు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు పంపారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

రూ.17.52 లక్షల దుర్వినియోగం

- విచారణలో తేల్చిన ఉన్నతాధికారులు
- ఇద్దరు వైకేపీ సీసీలు సస్పెన్షన్

అనంతపురం: ఉరవకొండలోని రెండు గ్రామైక్య సంఘాలకు మంజూరైన రుణాలు దుర్వినియోగమయ్యాయి. సొమ్ము రికవరీలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు వైకేపీ సీసీలపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. రుణాలు పక్కదారి పట్టించిన ఇద్దరు యానిమేటర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఉరవకొండలోని చందమామ, గంగ గ్రామైక్య సంఘాలకు గత ఏడాది డిసెంబర్ 22న స్త్రీ నిధి, బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. ఇంతకంటే ఎక్కువ రుణం వచ్చేలా చేస్తామని నమ్మబలికి యానిమేటర్లు వహీదా, రషీదాలు సభ్యులకు పంచిన రూ.17,52,459 సొమ్మును తిరిగి వసూలు చేసుకున్నారు. కానీ రుణం పెరగలేదు.. తమ నుంచి తీసుకున్న డబ్బూ వెనక్కు ఇవ్వలేదు. సభ్యులు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో గ్రామ సమైక్య సభ్యులు అదే నెల 26న కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదే నెల 30న మరోమారు కలిసి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ-వైకేపీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. యానిమేటర్లు అక్రమాలకు పాల్పడినట్లు తేల్చారు. అయితే వారి నుంచి సొమ్ము రికవరీ చేయకుండా సీసీలు వి.చంద్రశేఖర్, సి.మల్లేషు నిర్లక్ష్యం వహించారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీలు వి.చంద్రశేఖర్, సి.మల్లేషును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు యానిమేటర్లు వహీదా, రషీదాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. డ్వాక్రా సంఘాల్లో సొమ్ము దుర్వినియోగం చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని పీడీ హెచ్చరించారు.

ఎస్‌హెచ్‌జీల పటిష్టతకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, సంఘాల సభ్యులు

- అధికారులకు డీఆర్‌డీఏ పీడీ ఆదేశం

అనంతపురం/అర్బన్: స్వయం సహాయక సంఘాల పటిష్టతకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, సమాఖ్య ప్రతినిధులను డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి ఆదేశించారు. ఇప్పటి వరకూ సంఘాల్లో లేని మహిళలందరినీ ఇకపై సభ్యులుగా చేర్చాలని సూచించారు. ఈ నెల 30వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. 'సంఘటన సే సమృద్ధి' కార్యక్రమం కింద స్వయం సహాయక సంఘాల్లో మహిళలను సభ్యులుగా చేర్చి, వారి ఆర్థిక ప్రమాణాలు మెరుగుపడేలా చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం డీఆర్‌డీఏ పీడీలతో ఢిల్లీలోని కన్వెన్షన్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిజాసింగ్ సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఏపీడీ ఈశ్వరయ్య పాల్గొన్నారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలను సంఘాల సభ్యులుగా చేర్పించడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులతో పీడీ నరసింహారెడ్డి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 99 శాతం మంది అర్హులైన మహిళలు వివిధ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. అర్హత ఉండి ఇప్పటి వరకూ సంఘాల్లో సభ్యులుగా లేని వారికి అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఇందు కోసం ఈ నెల 18 నుంచి 30 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏపీఎం అనిత, ఐటీ యాంకర్ బి.చంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి ఇఫ్తార్ విందు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ఆరు గంటలకు నగరంలోని పోలీస్ వెల్ఫేర్ కాంప్లెక్స్‌లో ముస్లింలకు జిల్లాస్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మొహమ్మద్ రఫి తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అమ్మ ఆరోగ్యంపై సర్కారు దృష్టి

- ఒత్తిడితో అనర్థాలు అనేకం
- ఆందోళన వీడితే ఆరోగ్యం
- గర్భిణులకు ఆస్పత్రుల్లో అవగాహన

ఒత్తిడి, ఆందోళన గర్భిణుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రసవం కష్టతరమయ్యేలా చేస్తాయి. గర్భిణులు అనవసరపు భయాలు, ఆలోచనలు వీడాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకుని సంతోషంగా ఉండటంతో పాటు చక్కటి పౌష్టికాహారం తీసుకోవడంపై దృష్టి పెడితే సుఖ ప్రసవం జరుగుతుంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారు.

రాయదుర్గం: ఒత్తిడి కారణంగా గర్భధారణలో అనేక సమస్యలు తలెత్తుతాయి. కొన్నిసార్లు, అధిక ఒత్తిడి కారణంగా మహిళల్లో బీపీ పెరుగుతుంది. దాని కారణంగా గర్భస్రావం అయ్యే ఛాన్స్ ఉంది. ఇది కాకుండా, ప్రీ-మెచ్యూర్ డెలివరీ పరిస్థితి కూడా ఏర్పడవచ్చు. ఒత్తిడికి గురవడం వల్ల స్త్రీ నిద్రకు భంగం కలుగుతుంది. ఆకలి అనిపించదు. ఇది పిల్లల ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది.

తొలి 5 నెలలు అత్యంత జాగ్రత్త

గర్భిణులు తొలి ఐదు నెలలు అత్యంత జాగ్రత్తలు పాటించాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు. కొందరైతే ప్రతి చిన్న విషయానికీ టెన్షన్‌కు గురికావడం సర్వసాధారణమైపోతోంది. ఉద్యోగం చేసేవారు, చేయని వారిలోనూ మానసిక ఒత్తిడి సహజం. పనులకెళ్లే కొందరిలో ఆరోగ్యంపై ఒత్తిడి పెరిగి సంఘర్షణకు లోనవుతుంటారు. కార్యాలయానికి లేదా పని ప్రదేశానికి వెళ్లి రావడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, విధుల్లో ఎదురయ్యే ఒత్తిళ్లకు తీవ్ర ఆలోచనలు పెరిగి అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు.

గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

మాతాశిశు మరణాలు పూర్తిగా అరికట్టాలనే దృఢనిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ప్రస్తుతం 40,655 మంది గర్భిణులు ఉన్నారు. గర్భిణులు రక్తహీనత నుంచి గట్టెక్కాలంటే పౌష్టికాహారం తీసుకోవడం ఒక్కటే మార్గమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్, ఫోర్టిఫైడ్ బియ్యం, కోడిగుడ్లు, పాలు, బెల్లం, ఖర్జూరం, ఆయిల్, బ్యాళ్లు, రాగిపిండి, పాలు లాంటి పోషకాలు కలిగిన ఆహారం క్రమం తప్పకుండా అందజేస్తూ ఆరోగ్యాలను కాపాడుతోంది. ప్రతి నెలా 9న మాతృత్వ వందన యోజన ద్వారా ప్రత్యేక చికిత్సలు నిర్వహిస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా గర్భిణులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ఆస్పత్రుల్లోనే అవగాహన కల్పిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు..

- నలుగురితో మాట్లాడితేనే ఒత్తిడిపై విజయం..
- ప్రతి గర్భిణీ ప్రసూతి వైద్యుల సలహా, సూచనలు తప్పక పాటించాలి.
- ఒత్తిడిని జయించే మార్గాలను అన్వేషించాలి.
- నలుగురితో మాట్లాడుతూ.. నవ్వుతూ గడపాలి.
- సరైన ఆహారం తినడంతో పాటు తగినంత వ్యాయామం చేసి.. నిద్రపోవాలి.



ప్రభుత్వ సేవలు బాగున్నాయి



ప్రతి నెలా తొమ్మిదో తేదీన రాయదుర్గం ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ఒత్తిడికి లోనైతే దాని నుంచి ఎలా బయటపడాలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రసవానికి ఇబ్బందేమీ లేదని భరోసా కల్పిస్తున్నారు. గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షణ, వైద్య సేవలు ప్రభుత్వపరంగా బాగున్నాయి.

– వరలక్ష్మి, గర్భిణి, రాయదుర్గం

ఆలోచన తగ్గించాలి



గర్భిణులు అనవసరపు ఆలోచనలు తగ్గిస్తేనే.. ఆందోళన అదుపులో ఉంటుంది. ఒత్తిడికి లోనయ్యే పనులు పూర్తిగా మానుకోవాలి. ప్రశాంతంగా ఉండడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని.. పౌష్టికాహారం తీసుకోవాలి. ప్రతి నెలా 9న ఆస్పత్రిలో 150 నుంచి 200 మంది గర్భిణులకు 'మాతృత్వ వందన యోజన' ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి కాన్పు జరిగే వరకూ పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– మాధవి, గైనిక్ వైద్యురాలు, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన



గర్భిణులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ప్రభుత్వాస్పత్రుల్లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. డాక్టర్లు పరీక్షలు నిర్వహించి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీస్తుంటారు. వారిలో ఏమాత్రం మార్పు గమనించినా డాక్టర్ కౌన్సెలింగ్‌కు పంపుతారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది.

– యుగంధర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, అనంతపురం

క్లుప్తంగా

చీనీ తోటకు నిప్పు



కాలిపోయిన చీనీ చెట్లు

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లిలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో రైతు గుజ్జుల వనజ సాగు చేసిన చీనీ తోట దగ్ధమైంది. రెవెన్యూ అధికారులు తెలిపిన మేరకు... గుజ్జుల వనజ తనకున్న 4.45 ఎకరాల్లో 757 చీనీ చెట్లతో తోటను అభివృద్ధి చేసింది. మంగళవారం సాయంత్రం తోటలో మంటలు చెలరేగి చీనీ చెట్లను చుట్టుముట్టాయి. విషయాన్ని గమనించిన స్థానికులు మంటలు అదుపు చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న మంటలు అదుపు చేయలేక సమాచారం అందించడంతో ఉరవకొండ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేసింది. అప్పటికే 757 చీనీ చెట్లు కాలిపోయాయి. దీంతో రైతుకు రూ.6.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. తోటను వీఆర్వో నాగన్న, గ్రామకార్యదర్శి మురళి, సచివాలయ ఉద్యోగి శివప్రకాష్ తదితరులు పరిశీలించి, నష్టం అంచనాలపై నివేదిక సిద్ధం చేశారు.

జాతీయ క్రికెట్ అకాడమీ శిక్షణ శిబిరం ప్రారంభం



అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామం వేదికగా జాతీయ క్రికెట్ అకాడమీ అండర్–16 క్రీడాకారుల శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది క్రీడాకారులు తరలివచ్చారు. తొలి రోజు క్రీడాకారులకు యోయో, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. శిబిరం హెడ్ కోచ్ రాకేష్ ధ్రువ్, బ్యాటింగ్ కోచ్ వినీత్ ఇండుల్కర్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ సూరజ్ యాదవ్, ఫీల్డింగ్ కోచ్ సెబాస్టియన్ ఆంటోని, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర ఆదాయమే లక్ష్యం

- సెర్ప్ ఆధ్వర్యంలో పొట్టేళ్ల పెంపకం
- స్వయం సహాయక సంఘాల మహిళలకు యూనిట్లు
- జిల్లాలో ఇప్పటికే 56 యూనిట్ల మంజూరు



ఈమె పేరు పి.జ్యోతి. ఉరవకొండ మండలంలోని లత్తవరం తండా నివాసి. పొట్టేళ్ల పెంపకానికి ఆసక్తి చూపడంతో సెర్ప్ ఆధ్వర్యంలో ఆమెకు యూనిట్ మంజూరైంది. యూనిట్ వ్యయంలో రూ.30 వేలు సబ్సిడీ కింద ప్రభుత్వం మంజూరు చేసింది. 8 పొట్టేళ్ల పెంపకం చేపట్టిన ఆమె... వాటిని పెంచి పోషించి ఏడాదికి రూ.70 వేలకు పైగా ఆదాయం గడిస్తోంది. ఇది అదనపు ఆదాయం కావడంతో ఆనందంగా ఉందని పేర్కొంటున్న ఆమె... ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



ఈమె పేరు లక్ష్మి. ఉరవకొండ మండలం కొనాపురం గ్రామం. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో మూడు నుంచి ఐదు నెలల వయసున్న 8 పొట్టేళ్ల పిల్లలను కొనుగోలు చేసింది. పొట్టేళ్ల పిల్లలు అకాల మృత్యు వాత పడి ఆమె నష్టపోకుండా ప్రభుత్వమే ఏడాది పాటు బీమా సౌకర్యం కల్పించింది. ప్రస్తుతమున్న మార్కెట్ ధర ప్రకారం విక్రయిస్తే మొత్తం రూ.1.20 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడి పోగా రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకూ మిగలడంపై ఆమె హర్షం వ్యక్తం చేస్తోంది.

అనంతపురం: వ్యవసాయం, పాడి పశువుల రంగంలో ఉన్న రైతులు, అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోంది. ఇల్లాలు బాగుంటే ఇల్లు బాగుంటుందని.. అక్క చెల్లెమ్మలు, రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా ఆయా వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారు. అక్క చెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం.... తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో వారు ఆర్థికంగా నిలదొక్కుకొని జీవన ప్రమాణాలను పెంచుకునేలా పొట్టేళ్ల పెంపకం యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఈ పథకాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అమలు చేస్తోంది.

సబ్సిడీ కింద రూ.30 వేలు

జిల్లాలో ఇప్పటి వరకూ స్వయం సహాయక సంఘాల మహిళలకు 56 పొట్టేళ్ల పెంపకం యూనిట్లు మంజూరు చేశారు. పొట్టేళ్ల పెంపకంపై మహిళలకు శిక్షణ ఇచ్చిన అనంతరం యూనిట్లు అప్పగిస్తున్నారు. ఒక్కో యూనిట్ ధర రూ.60వేలు కాగా, ఇందులో రూ.30 వేలు సబ్సిడీ కింద ప్రభుత్వం చెల్లిస్తోంది. మిగిలిన రూ.30 వేలులో రూ.10 వేలు లబ్ధిదారుని వాటా, మరో రూ.20 వేలను రుణం (ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ) రూపంలో అందిస్తారు. ఒక్కో యూనిట్‌లో 8 పొట్టేళ్ల పిల్లలు ఉంటాయి. పొట్టేళ్ల అకాల మృత్యువాతపడి పెంపకందార్లు నష్టపోకుండా ఉండేలా ఏడాది పాటు వాటికి బీమా చేయిస్తారు. పొట్టేళ్ల మాంసానికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో ఏడాదికి రూ.60 వేలు ఆదాయం గడించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

ఇవీ ఉపయోగాలు

- జీవాల పెంపకం ద్వారా భూమి లేని నిరుపేద మహిళలకు ఉపాధి కలుగుతుంది. ఈ పథకం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది.
- జీవాల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందవచ్చు.
- పెంపకందారులకు వాణిజ్య పరంగా మంచి భవిష్యత్తు ఉంటుంది.
- జీవాలలో పునరుత్పత్తి ప్రక్రియ వేగంగా ఉండడం వల్ల తక్కువ సమయంలోనే మంద అభివృద్ధి చెందుతుంది. తద్వారా త్వరత్వరగా లాభాలు ఆర్జించవచ్చు.
- పంట పొలాలకు జీవాల మూత్రం, పేడ శ్రేష్టమైన ఎరువుగా ఉపయోగపడి.. సేంద్రీయ వ్యవసాయానికి తోడ్పడుతుంది.

లబ్ధి చేకూరే పథకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొట్టేళ్ల పెంపకం పథకం మహిళల ఆర్థిక స్థితి మెరుగుదలకు దోహదపడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకూ 56 యూనిట్లు మంజూరు చేశాం. మొత్తం యూనిట్ వ్యయంలో సగం పెట్టుబడిని సబ్సిడీ కింద ప్రభుత్వమే భరిస్తోంది.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, సెర్ప్

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం చేసుకోండి

- చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్ పంట కాలానికి అవసరమైన విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. ప్రధానంగా చిరుధాన్యాల పంటల సాగు విస్తరణపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. రాగి, జొన్న, సజ్జ, ఆరిక, సామ, అండుకొర్రలు లాంటి పంటలు సాధ్యమైనంత ఎక్కువగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతపురం నుంచి జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్, డివిజన్ ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు. ఆర్బీకే వేదికగా పంటల ప్రణాళిక తయారు చేసి, ప్రాంతాల వారీగా భూములను బట్టి అవసరమైన విత్తన రకాల ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే పంపాలన్నారు. నాలుగైదు రోజుల్లో సరఫరా చేపట్టనున్న పచ్చిరొట్ట (గ్రీన్‌మెన్యూర్) విత్తనాలను రాయితీతో రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద చిరుధాన్యపు పంటలను ప్రోత్సహించాలన్నారు. రబీ ఈ–క్రాప్, వేసవి పంటల ఈ–క్రాప్, ఈ–కేవైసీ, ఆర్బీకేలకు అనుబంధంగా రెండో విడతలో 219 కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు ఏర్పాటు ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. వచ్చే ఏడాది పంటల సాగులో డ్రోన్ల వినియోగాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ క్రమంలో నిరుద్యోగులను గుర్తించి వారిని డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిరప, పత్తి విత్తనాలు, ఎరువులు అమ్మకాలపై నిఘా ఉంచేందుకు వీలుగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

21 నుంచి కడపలో టీ-20 మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకూ సౌత్‌జోన్ ఏసీఏ సీనియర్ మెన్ టీ–20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ మేరకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ మంగళవారం తెలిపారు. వైఎస్సార్, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి.

పేలుడుపై వీడని మిస్టరీ

- ఈ నెల 7న చోటు చేసుకున్న ఘటన
- దర్యాప్తులో కనిపించని పురోగతి
- అనంతకు చేరుకోని ఫోరెన్సిక్ బృందం
- 11 రోజులుగా ఘటనాస్థలిలో పడి ఉన్న కెమికల్ క్యాన్‌లు



ఘటనా స్థలంలో పడి ఉన్న కెమికల్ క్యాన్‌లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రాన్ని ఉలికిపాటుకు గురి చేసిన భారీ విస్ఫోటనం వెనుక ఉన్న మిస్టరీ వీడలేదు. ఘటన జరిగి 11 రోజులైనా దర్యాప్తులో పురోగతి కనిపించడం లేదు. పేలుడుకు కారణాలేమిటో కూడా పోలీసులు బహిర్గతం చేయలేకపోతున్నారు.

ఆ రోజేమి జరిగింది?

ఈ నెల 7న అనంతపురం ఆర్టీఓ కార్యాలయ సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే పెయింట్స్ తయారీకి వినియోగించే రసాయనాలున్న ప్లాస్టిక్ డ్రమ్ములను ఖాళీ చేస్తుండగా పేలుడు చోటు చేసుకుంది. ఘటనలో డ్రమ్ములను ఖాళీ చేస్తున్న చాకలి సతీష్ శరీరం ముక్కముక్కలై వంద అడుగుల దూరంలోని ఇళ్లపై, రహదారిపై పడింది. పేలుడు జరిగిన ప్రాంతానికి 40 అడుగుల దూరంలో రహదారికి అటు వైపుగా మొండెం ముద్దగా పడింది. పేలుడుకు కారణమైన డ్రమ్ము మాత్రం అలాగే ఉంది.

పేలుడుకు కారణాలేంటి?

హైడ్రోజన్ సల్ఫైడ్ విడుదల లేదా కెమికల్ రియాక్షన్ వల్ల పేలుడు సంభవించి ఉండవచ్చునని ఘటన జరిగిన రోజు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకు నిర్దిష్టమైన ఆధారాలతో కూడిన నివేదికను ఇవ్వలేకపోయారు. దీంతో పేలుడు వెనుక కారణాలపై స్పష్టత లేకుండా పోయింది.

టిన్నర్, డిస్టంపర్ కలయిక వల్లనేనా?


టిన్నర్, డిస్టంపర్ కలిపిన క్యాన్‌ను ఏళ్ల తరబడి మూతపెట్టి ఉంచడం వల్ల కెమికల్ రియాక్షన్ జరిగి పేలుడుకు దారి తీసినట్లు ఘటన జరిగిన రోజు పోలీసులు పేర్కొన్నారు. దీనికి తోడు మూడు రోజుల పాటు క్యాన్‌ను ఎండకు పడేయడం వల్ల ఒత్తిడి శాతం పెరిగి పేలుడు చోటు చేసుకుని ఉంటుందని భావిస్తున్నట్లుగా తెలిపారు. అయితే దీనిపై కూడా శాస్త్రీయ విశ్లేషణ లోపించిందనే విమర్శలున్నాయి.

ఆ క్యాన్‌లలో ఏముంది?

ఘటన జరిగిన ప్రాంతంలో రసాయనాలతో కూడిన మొత్తం తొమ్మిది క్యాన్‌లుండగా... అందులో ఓ క్యాన్‌ను తెరిచి కెమికల్‌ను బయటపడేసే క్రమంలో పేలుడు చోటు చేసుకుంది. ఘటన అనంతరం మిగిలిన 8 క్యాన్‌లు అక్కడే వదిలేశారు. అక్కడి నుంచి వాటిని కదిలించే సాహసాన్ని పోలీసులు సైతం చేపట్టలేకపోతున్నారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందం వస్తుందని, వారి పరిశీలన అనంతరం ఆ క్యాన్‌లను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు. అయితే ఘటన జరిగి 11 రోజులైనా ఫోరెన్సిక్ నిపుణుల బృందం రాలేదు. పైగా అక్కడి క్యాన్‌లను బాంబ్ స్క్వాడ్ సాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించి డిస్పోజల్ చేయాలని ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఎండలో పడేసిన క్యాన్‌లలో ఏముందో ఎవరికీ తెలియదు. అవి ఎప్పుడు పేలుతాయో? ఎలాంటి దారుణాలను చవి చూడాల్సి ఉంటుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు చొరవ తీసుకుని కెమికల్ క్యాన్‌లను అక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో మీరే కీలకం

- మహిళా పోలీసులనుద్దేశించి డీఐజీ అమ్మిరెడ్డి



ప్రసంగిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి కొనియాడారు. పనితీరులో ప్రతిభ కనబరిచిన గ్రామ/వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ... సచివాలయ మహిళా పోలీసు వ్యవస్థ ఏర్పాటైన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణలో గణనీయమైన ఫలితాలను రాబట్టినట్లు పేర్కొన్నారు. విలేజ్ కానిస్టేబుల్, మహిళా పోలీస్ సమన్వయంతో పని చేస్తే మరిన్ని మంచి ఫలితాలు ఉంటాయన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక శక్తులపై నిఘా పెట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన 16 మంది మహిళా పోలీసులకు జ్ఞాపికలు, రివార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, తాడిపత్రి డీఎస్పీ చైతన్య, ఎస్బీ సీఐలు చక్రవర్తి, ఇందిర, పోలీస్ టెక్నికల్ వింగ్ ఎస్ఐ సుధాకర్‌యాదవ్, ఎస్ఐ ఆశ, ఆర్ఎస్ఐలు రాజశేఖరరెడ్డి, భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మా.. కాపాడమ్మా



జ్యోతులతో తరలివస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురంలో ముత్యాలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆలయం కిటకిటలాడింది. ఆలయ నిర్వాహకులు, భక్తులు పురం పొలిమేర నుంచి పెద్ద ముత్యాలమ్మ, చిన్న ముత్యాలప్ప ఉత్సవమూర్తుల పల్లకీతో ఆలయం వరకూ తీసుకొచ్చి కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూల జ్యోతులు, ప్రసాదాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. గొర్రెలు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.జాతరను పురస్కరించుకుని శ్రీకంఠపురం సందడిగా మారింది. ఏ ఇంటి ముందు చూసినా షామియానాలు, బంధుమిత్రులతో కళకళలాడాయి. జనం రాకపోకలతో రోడ్లు కిక్కిరిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా టూటౌన్, రూరల్ సీఐలు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. కాగా, జాతర సందర్భంగా ఈ ప్రాంతాల్లో సుమారు 1,500 కుటుంబాలు విందు, వినోదాల కోసం రూ.2 కోట్లు పైగా వ్యయం చేసి ఉంటారని అంచనా.

గిరిజన గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్టీలకు 64 సీట్లు, ఎస్సీలకు 10, బీసీలకు 4, ఓసీలకు 2 చొప్పున సీట్లు ఖాళీలున్నాయి. ఆసక్తి ఉన్న వారు మే, 30వ తేదీ లోపు www. aptwgurukulam.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 95426 55088, 79958 42894లో సంప్రదించవచ్చు.

28న ఖాదర్‌వలి సదస్సు

అనంతపురం అగ్రికల్చర్: చిరు ధాన్యాల సాగు, సిరిధాన్యాల ఆహారోత్పత్తులు, వినియోగ అవసరాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు అనంతపురం నగర శివారులోని కురుగుంటలో మైసూరుకు చెందిన ప్రఖ్యాత ఆహార శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదరణ రామకృష్ణ, విశ్రాంత ప్రొఫెసర్ గంగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కురుగుంటలోని పుడమిసిరి మిల్లెట్ హోటల్‌లో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారుల సందేహాలను ఆయన నివృత్తి చేయనున్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు రామ్‌నగర్‌లోని కమ్మభవన్‌లో అవగాహన కార్యక్రమం ఉంటుంది. ఇటీవల పద్మశ్రీ పురస్కారం అందుకున్న తర్వాత తొలిసారిగా జిల్లాకు విచ్చేయనున్న ఖాదర్‌వలిని ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించనున్నారు. అంతకు ముందు అదే రోజు ఉదయం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల సమీపంలోని బెస్ట్ యూనివర్సిటీలో జరిగే రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొననున్నారు.

అర్చకుల సంక్షేమమే లక్ష్యం

- జిల్లా సర్వసభ్య సమావేశంలో అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు

అనంతపురం కల్చరల్: సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఆలయాల్లో అర్చకులు పూజలు సాగిస్తున్నారని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు అన్నారు. అనంతపురంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం వేదికగా మంగళవారం జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అర్చకుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తు అనేక పథకాలు.. కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్చకుల దరి చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధూపదీప నైవేద్యం, 43 రిజిస్ట్రేషన్ వంటి సమస్యలు అర్చకులను పీడిస్తున్నాయన్నారు. ఎండోమెంట్ కమిషనర్ వంటి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి అర్చక సంఘాల ప్రతినిధులందరూ కృషి చేయాలన్నారు. అర్చకులకు, ప్రభుత్వానికి అర్చక సమాఖ్య వారధిగా నిలిచే మరిన్ని కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సమావేశంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి హనుమంతరాయుడు, ఉపాధ్యక్షుడు మారుతీప్రసాద్, కేవీసీ రాయలు, శ్రీనివాసరావు, వెంకటగిరి, నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పెద్దవడుగూరు: కులం పేరుతో బాలురను దూషించినందుకు పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామానికి చెందిన కొప్పెర్ల రవీంద్రారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. దిమ్మగుడికి చెందిన పదో తరగతి విద్యార్థి భరత్‌తేజ తన స్నేహితులతో కలసి... సోమవారం మధ్యాహ్నం అదే గ్రామంలోని పంచర్ షాప్ వద్దకు ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లాడు. ఆ సమయంలో పంచర్ వేయడానికి షాపు యజమాని లేకపోవడంతో అక్కడే ఉన్న మహిళ... వారిని కూర్చొమని చెప్పింది. దీంతో వారు కుర్చీలో కూర్చొని ఉండగా అక్కడే ఉన్న అగ్రవర్ణానికి చెందిన రవీంద్రారెడ్డి వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కులదూషణకు పాల్పడ్డాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ప్రమాదంపై కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రం సమీపంలోని దేవరకొండపై కారు బోల్తాపడిన ఘటనకు సంబంధించి కేసు చేసినట్లు సీఐ అస్రార్‌బాషా తెలిపారు. సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో అనంతపురంలోని శ్రీవిద్యానికేతన్ కరస్పాండెంట్ ఉమాపతి మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఘటనకు సంబంధించి మంగళవారం ఉదయం ఉమాపతి కుమారుడు విద్యాసాగర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. ఉమాపతి కారులో కూర్చొని ఫోన్‌లో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు కారు లోయలోకి దూసుకెళ్లి, తన తండ్రి మృతి చెందినట్లుగా ఫిర్యాదులో విద్యాసాగర్ పేర్కొన్నట్లు తెలిపారు. ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

బాలుడి ఆచూకీ తెలపండి



విరుపాక్షగౌడ్

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా, హొలగుంద మండలం, ఎల్లార్తి గ్రామానికి చెందిన విరుపాక్షగౌడ్ మూడు రోజులుగా కనిపించడం లేదని మంగళవారం గుంతకల్లు రూరల్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న తప్పిపోవడంతో హొలగుంత పోలీసులకు బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విరుపాక్షగౌడ్ గుంతకల్లు పరిసర ప్రాంతాల్లో తారసపడినట్లుగా వారికి సమాచారం అందడంతో మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 96666 18418 సమాచారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

కామాక్షయ్య సేవలు ప్రశంసనీయం



కామాక్షయ్యను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహా రెడ్డి

అనంతపురం: స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి. కామాక్షయ్య సేవలు ప్రశంసనీయమని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి అన్నారు. స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ఉన్న కామాక్షయ్య నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఛాంబర్‌లో ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ కామాక్షయ్య ఐదేళ్లపాటు సమర్థంగా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ఈశ్వరయ్య, ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. రాధారాణి, పర్యవేక్షణాధికారి జిలాన్ బాషా, హనుమేష్ బాబు, ఏజీఎం , డీపీఎం, ఏపీఎంలు , స్త్రీనిధి మేనేజర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుల ఆర్థికసాయం



విద్యార్థి తండ్రికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: హోసూర్‌లో భాను ప్రకాష్ అనే డిప్లమో విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పాలిటెక్నిక్ అధ్యాపకులు ఈ విషయం తెలుసుకుని హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకుంటున్న విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఈఈఈ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఏ కార్తికేయ శర్మ రూ.15 వేలు, ఒంటికొండ చంద్రమోహన్ రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి మంగళవారం పరిశీలించారు. త్వరలో న్యాక్ పీర్ కమిటీ పర్యటించనున్న నేపథ్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నాణ్యతను పర్యవేక్షించారు. వర్సిటీలో తారు రోడ్లను పరిశీలించారు. న్యాక్ మంచి రేటింగ్ వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలను, న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, జేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్, ఇతర నాయకులు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు.

రంజాన్ మాసం దానధర్మాలకు ప్రతీక



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం క్రైం/అనంతపురం సప్తగిరి సర్కిల్: రంజాన్ మాసం దానధర్మాలకు, సేవాతత్వానికి ప్రతీక రంజాన్ అని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాతూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు తబ్రేజ్, హిద్దూల ఆధ్వర్యంలో నిర్వహించిన రంజాన్ తోఫా కార్యక్రమానికి నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలను ఆయన తెలియజేశారు. రంజాన్ మాసంలోని లైలతుల్ ఖద్ర్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ తోఫాను అందించిన నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదలందరు రంజాన్ పండుగను అత్యంత వేడుకగా నిర్వహించేందుకు నిర్వాహకులు వారికి రంజాన్ తోఫాను అందించారన్నారు. ఇది ఎంతో పుణ్యకార్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షకీల్, వాసగిరి నాగ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ: నగరంలోని 6వ రోడ్డులో స్థానిక డివిజన్ కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు, రంజాన్ తోఫా అందించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

రాప్తాడురూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పేద ముస్లింలకు అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్లకాలనీలోని మజీద్ బిలాల్ మసీదు ముతవల్లి రఫీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మసీదు కార్యదర్శి మహబూబ్‌బాషా, మునాఫ్, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ యాదవ్, శ్రీనివాసులు, పార్టీ సచివాలయ కన్వీనర్లు సుకుమార్, రమేష్, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



ఆత్మకూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నాయకులు



రాప్తాడు: జి.కొత్తపల్లిలో స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్లు

రాప్తాడు: వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా క్షేత్ర స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిన్న క్రిష్ణా రెడ్డి, సచివాలయ కన్వీనర్లు తిరుపాల్ రెడ్డి, వెంకటేష్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి పంచాయతీలో పన్నెండో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాతిరెడ్డి, డీలర్ ప్రసాద్ రెడ్డి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ బాలకృష్ణా రెడ్డి, వార్డు మెంబర్ ఉప్పర నరసింహులు, ఖాశీం సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఎలాంటి భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు సచివాలయ మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా లైలతుల్ ఖద్ర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వ్యాప్తంగా ముస్లింల పవిత్ర రాత్రి లైలతుల్ ఖద్ర్ పండుగను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో వచ్చే అత్యంత ప్రత్యేకమైన రాత్రిని పురస్కరించుకొని మసీదులను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందులో భాగంగా ముస్లింలు పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. లైలతుల్ ఖద్ర్‌ను పురస్కరించుకొని ఆలింగనం చేసుకుని, ముసాఫా ఇచ్చుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెల్లవారుజామున వరకు ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ఆయా మసీదుల్లో బుధవారం తెల్లవారుజామున సెహరీ ఏర్పాట్లను చేశారు.



నమాజు చేస్తున్న మేయర్ వసీం, ముస్లింలు

ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం

- నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిషేధిత ప్లాస్టిక్‌కు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీగా దాడులు కొనసాగించాలని జాయింట్ తనిఖీ టీంను కమిషనర్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కమర్షియల్ ట్యాక్స్, పోలీసులు, తదితర అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి, ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా వివిధ శాఖల అధికారులతో జాయింట్ తనిఖీ టీంను కమిషనర్ ఏర్పాటు చేశారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నా, ప్లాస్టిక్ కవర్లపై 120 మైక్రాన్స్ అని ముద్రించి, అందులో తక్కువ మైక్రాన్స్ చూపించే విధంగా ఉన్న వాటిపై ఏమాత్రం ఆలోచించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎవరినీ ఉపేక్షించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులు సైతం స్వచ్ఛందంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించకూడదని కమిషనర్ సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్రావు, టూటౌన్ సీఐ శివరాముడు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

వ్యాపారుల పట్ల వివక్ష లేకుండా తనిఖీలు జరపాలని, పన్ను తగ్గించాలని, తదితర డిమాండ్లతో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం వారు కమిషనర్ రమణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకునిబంధనలకు లోబడి తాము చర్యలు తీసుకుంటామని, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యులు కావాలని బీజేపీ నాయకులను కమిషనర్ సూచించారు. కమిషనర్‌ను కలసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్, ఫయాజ్ ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలకు చర్యలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆర్ఎంఓలు, సీఎంఓలు, వివిధ విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ సర్వజనాస్పత్రిలో ఓపీ పెరుగుతోందన్నారు. రోగులకు వైద్యం సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఠాగూర్ సినిమాను తలపించేలా చేయొద్దండి: క్యాజువాలిటీలోనే రోగి మృతిచెందితే.. అక్కడే డిక్లేర్ చేయాలని సూపరింటెండెంట్ అన్నారు. ఠాగూర్ సినిమాను తలపించేలా ఏఎంసీకి తరలించి డిక్లేర్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నిబంధనలను పాటించడం ద్వారా రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. తప్పనిసరిగా క్యాజువాలిటీని అసిస్టెంట్ ఆర్ఎంఓలు మధ్యాహ్నం 1 గంటకు, రాత్రి 7 గంటలకు సందర్శించాలన్నారు.కార్యక్రమంలో ఆర్ఎంఓ వైపీ రావు, డాక్టర్ పద్మజ, డాక్టర్ సునీత, డాక్టర్ అభిషేక్, వైద్యాధికారులు డాక్టర్ నవీద్, డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ భీమసేనాచారి, డాక్టర్ సుహాసిని, డాక్టర్ రామస్వామి నాయక్,



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్

డాక్టర్ కళ్యాణ్, సీఎంఓలు రజిత, నీలోఫర్, శ్రీనివాసనాయక్, రీనా, పవన్‌కుమార్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై విచారణ పూర్తి

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈ నెల 7న కామాక్షి అనే మహిళ మృతిపై విచారణ పూర్తయ్యిందని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి డాక్టర్ నవీద్ అహమ్మద్, డాక్టర్ భీమసేనాచారి, డాక్టర్ నవీన్‌కుమార్ బృందాన్ని విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక ను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), జిల్లా కలెక్టర్‌లకు పంపించినట్లు తెలిపారు. వారి ఉత్తర్వుల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ ప్రజాచైతన్య కాలనీలో పది రోజులుగా జరుగుతున్న సమ్మర్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన టోర్నీలో రాక్ స్టార్ ఆనంద్, అఘోర జట్లు తుదిపోరుకు చేరుకున్నాయి. మొదటి బ్యాటింగ్ చేసిన రాక్‌స్టార్ ఆనంద్ జట్టు 14 ఓవర్లలో 88 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అఘోర జట్టు కేవలం 9 ఓవర్లలోనే ఛేదించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.30 వేలు నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ. 15 వేలు నగదు, ట్రోఫీ అందిదించారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆర్గనైజర్లు ఆదిరెడ్డి, బండి ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు వాహనాల వేలం

ఆత్మకూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాహనాలు వేలం పాట ఉంటుందని ఏఎస్ఐ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన రెండు ఆటోలు, ఐదు ద్విచక్ర వాహనాలను ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

98 డీఎస్సీ ఉద్యోగులకు అభినందనలు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో అవుట్‌సోర్సింగ్ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి. విజయ్‌కుమార్, లైబ్రరీలో పని చేస్తున్న లక్ష్మీకాంత రెడ్డి డీఎస్సీ–1998కు ఎంపికయ్యారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్ధన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ వీరికి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ ఉద్యోగం అవకాశం కల్పించారన్నారు. గతంలో ఎంతో మంది సీఎంలను చూశామని, జగన్‌మోహన్ రెడ్డి ఒక దార్శనికుడు అన్నారు. 1998 డీఎస్సీ అభ్యర్థుల సమస్య 25 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉండేదన్నారు. ఇన్నేళ్లుగా పెండింగ్ ఉన్న సమస్యను పరిష్కరించి, ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు.

మే 9,10 తేదీలో మహాసభలు

అనంతపురం టవర్‌క్లాక్: మే 9,10 తేదీల్లో స్త్రీవిముక్తి సంఘటన మహాసభలు జరగనున్నట్లు తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మెన్ సూర్యసాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. సూర్యసాగర్ మాట్లాడుతూ మహాసభలు అనంతపురం జీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన అధ్యక్షురాలు విజయ, లలిత, లక్ష్మి, నిర్మలరాణి, ఎస్ ఎం బాషా, తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, సి.పెద్దన్న, శాంతినారాయణ, రసూల్, ప్రమీల, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజానగర్‌లో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఖాజానగర్‌లోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కుటుంబ సభ్యులందరూ ఇంటిపైన నిద్రించారు. ఉదయం నిద్రలేచి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంటి అరుగుపై ఉంచిన సెల్‌ఫోన్, బీరువాలో ఉన్న రూ.15వేలు నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక రంగస్వామినగర్‌కు చెందిన రంగమ్మ అనే వివాహిత సోమవారం సోమవారం నుంచి కనిపించలేదు. ఈమె ఆచూకీ కోసం భర్త శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు గాలించినా ఫలితంలేకపోయింది. దీంతో త్రీటౌన్ పోలీసులకు మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశారు. రంగమ్మ ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు సెల్: 9490618679లో సమాచారం అందించాలని కోరారు.

పోలీసు కాంప్లెక్స్‌లో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరం నడిబొడ్డున పోలీసు అతిథి గృహం ముందు ప్రధాన రహదారిపై ఉన్న శ్రీనివాస బుక్‌స్టాల్‌లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దుకాణం షట్టర్‌కు వేసిన తాళాన్ని కట్ చేసి, లోపలికి ప్రవేశించి క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.65 వేలు ఎత్తుకెళ్లారు. అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో బాధితుడు లోకనాథ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృద్ధులు, కంటిచూపు సరిగాలేని వారికి, కంటి సమస్యలున్న వారికి కంటి పరీక్షలు చేయనున్నట్లు సర్పంచు వరలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేస్తారన్నారు.

సంక్షిప్త సమాచారం

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆత్మకూరు: సింగంపల్లి తండాలో ఇక నుంచి నీటి సమస్య ఉండదని సర్పంచ్ వెంకటేష్ నాయక్ తెలిపారు. సింగంపల్లి తండాలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేశారు. రూ.4లక్షలతో నూతనంగా పైప్‌లైన్ కూడా ఏర్పాటు చేశారు. మంగళవారం సింగంపల్లి తండాలో ఆర్‌డబ్ల్యూ ఎస్ జేఈ హరికుమార్, సర్పంచ్ వెంకటేష్‌నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాబావలి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్ గ్రామంలో ప్రతి కాలనీకి తిరిగి, నీరు వస్తోందా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనంతపురం శ్రీఖంఠంసర్కిల్: స్థానిక నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని నారాయణపురం చెక్ డ్యాంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన మేరకు.. మృతురాలు మెరూన్‌రెడ్ జాకెట్, నలుపు రంగు చీర ధరించి ఉంది. వయస్సు 60 ఏళ్లు, ఎత్తు 5 అడుగులు ఉండొచ్చు.వివరాలు తెలిసిన వారు నాల్గో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ఆత్మకూరు: సనప జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అనంతపురం జిల్లా సీనియర్ బాలురు, బాలికల జిల్లా షూటింగ్ బాల్ జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు మంగళవారం తెలిపారు. పలువురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి షూటింగ్ బాల్ క్రీడలకు వినోద్‌కుమార్, తరుణ్, కిరణ్, ప్రసన్నకుమార్, తేజనాథ్, సాయి, రామ్‌చరణ్, అఖిల్, నరసింహ, సుమన్, చిదానంద, అమరేంద్ర, రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు తెలిపారు.

విశిష్టమైనవి మన సంస్కృతీ సంప్రదాయాలు

అనంతపురం కల్చరల్: విశిష్టమైన మన సంస్కృతీ సంప్రదాయాలకు అందరం వారసులమేనని జిల్లా పురావస్తు శాఖ ఏడీ రజిత అన్నారు. మంగళవారం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నెహ్రూ పాఠశాల నుంచి పీస్ మెమోరియల్ హాల్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. సాయంత్రం ఇంటాక్ సభ్యులు, మేధావులు, పురావస్తుశాఖ అధికారులతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటాక్ సంస్థ జిల్లా కన్వీనర్ రామ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. పలువురు రచయితలు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

ఆత్మకూరు: మండలంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లాలని ఏపీఓ సుజాత తెలిపారు. మంగళవారం మండలంలోని పి.యాలేరు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ డివిజన్లలో బుధవారం సాయంత్రం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ ఎస్ఈ సతీష్‌చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. కూడేరులోని పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీ ఏర్పడిందని, వాటి మరమ్మతుల్లో భాగంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బీజేపీవి దిగుజారుడు రాజకీయాలు

అనంతపురం క్రైం: ప్లాస్టిక్ నిషేధంపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకున్నారని, అయితే బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తోందని మేయర్ వసీం పేర్కొన్నారు. నిబంధనలకు లోబడి నగరపాలక సంస్థ అధికారులు నిషేధిత ప్లాస్టిక్ అమ్ముతున్న షాపులపై దాడులు జరిపితే బీజేపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. మంగళవారం నగరంలో ర్యాలీ, నగరపాలక సంస్థ ముందు బీజేపీ నాయకులు ధర్నా చేసి, నగరపాలక సంస్థపై పలు ఆరోపణలు చేయడాన్ని మేయర్ తప్పుబట్టారు. గత ప్రభుత్వంలో బీజేపీ, టీడీపీలు రెండూ కలసి పోటీ చేశాయని, అప్పటి టీడీపీ హయాంలో నగరంలో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో బీజేపీ నాయకులకు తెలియదా? అని ప్రశ్నించారు.

ఈద్గాను శుభ్రం చేయండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈద్గా ప్రాంగణాన్ని శుభ్రం చేసే పనులు శరవేగంగా చేయాలని నగర మేయర్ వసీం ఆదేశించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్‌తో కలిసి మంగళవారం ఈద్గా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. కార్పొరేటర్లు తరిమెల అబూసాలెహ, బాబాఫక్రుద్దీన్, నాయకులు లక్ష్మీనగర్ ఖాజా, దాదు, రవి, మధు, మేరాజ్, ఏ1 రఫీ, అధికారులు పాల్గొన్నారు.

అత్యుత్తమ కట్టడాలకు మన్నికైనది భారతీ సిమెంట్



బీమా బాండ్లు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైన సిమెంట్ భారతీ సిమెంటని భారతీ సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ మోతీలాల్‌నాయక్ అన్నారు. మంగళవారం టీవీటవర్ సమీపంలోని లక్ష్మీసాయి ట్రేడర్స్ వద్ద తాపీ మేస్త్రీలకు ప్రమాదబీమా బాండ్లు అందించారు. ఈ సందర్భంగా మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైనది భారతీ సిమెంట్ అన్నారు. నిర్మాణ రంగంలో ఇంజినీర్లు భారతీ సిమెంట్‌నే ఎంపిక చేస్తున్నారన్నారు. పర్యావరణానికి అనుకూలంగా సిమెంట్ ఉంటుందన్నారు. పనిప్రదేశాల్లో తాపీ మేస్త్రీలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంపెనీ తాపీ మేస్త్రీలను దృష్టిలో ఉంచుకొని అందజేస్తున్న ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ట్యాబ్‌లు అందిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఐఎస్‌టీఎస్ఓ ఒలింపియాడ్ రెండో లెవల్లో గెలుపొందిన శ్రీచైతన్య అనంతపురం జోన్ విద్యార్థులను ఎస్పీ అభినందించారు. విజేతలకు ఆయన ల్యాప్‌టాప్‌లు బహుమతులుగా అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రణాళికతో ఇష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలు,సలహాలు పాటించాలన్నారు. గ్రాండ్ ప్రైజ్ విజేతలు హేమంత్ వెంకటసాయి, ప్రణీత్, సాయి చరణ్ వర్షిత్, లక్షిత్‌లకు ల్యాప్‌టాప్‌లు బహూకరించారు. మొదటి ప్రైజ్ కింద 13 మంది విద్యార్థులకు లెనొవో ట్యాబ్, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

నేత్రానందంగా మల్లాలమ్మ జాతర

అనంతపురం కల్చరల్: స్థానిక సూర్యానగర్‌లోని మల్లాలమ్మదేవి జాతర మేదర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి బెంగళూరు రోడ్డు సమీపంలోని జీఎంఆర్ గార్డెన్స్ వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. మేయర్ వసీం , అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, జిల్లా మేదర సంఘం అధ్యక్షుడు నాగరాజు, వైఎస్సార్‌సీపీనేత అనంత చంద్రారెడ్డి, డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్కల్‌కోట్ మహారాజ్ ఆరాధన : జిల్లాలోనే ఏకైక అవధూత స్వరూపులు అక్కల్‌కోట్ మహారాజ్ ఆశ్రమంలో ఆరాధన ఉత్సవం నిర్వహించారు. మంగళవారం హెచ్చెల్సీ కాలనీలో వెలసిన వలీస్వామి ఆశ్రమంలో నిర్వాహకులు విజయ్‌కుమార్, లక్ష్మయ్య స్వామీజీ ప్రారంభించారు. మహాగణపతి హోమం, భక్తిసంకీర్తనలతో నగర సంకీర్తన,అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ ఘనంగా జరిగాయి.